క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని శనివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తమ మొక్కులను చెల్లించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. వల్లభనేని కమలమ్మ పేరిట మనవడు కొల్లి రాజేష్ ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గుడివాడ లయన్స్ కంటి ఆస్పత్రి సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. ఈ పరీక్షల అనంతరం కంటి శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేసినట్లు లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు వై.పి.సి.ప్రసాద్, చంద్రశేఖర్, జంగం మోహనరావు, పెరుమాళ్ల పాల్గొన్నారు.

విద్యార్థుల సైకిల్ స్టాండ్ ప్రారంభం

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ గ్రామానికి చెందిన యార్లగడ్డ సుబ్బారావు పాఠశాల విద్యార్థులకు నూతనంగా నిర్మించిన సైకిల్ స్టాండ్‌ను దాత తల్లి యార్లగడ్డ స్వర్ణకుమారి చేతుల మీదగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత తల్లి మాట్లాడుతూ తమ కుమారుడు చదువుకున్న హైస్కూల్ విద్యార్థులకు తన తండ్రి యార్లగడ్డ జానార్దనరావు జ్ఞాపకార్థం సుమారు రూ.3లక్షలతో షెడ్ నిర్మాణ పనులు పూర్తి చేసి ఇవ్వటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.హరికిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి చౌర్యానికి పాల్పడితే చర్యలు

కైకలూరు: తాగునీటి చెరువులకు విడుదల చేసిన నీటిని చేపల చెరువులకు దారి మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం హెచ్చరించారు. కైకలూరు పోల్‌రాజ్ కాలువకు 170 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన సందర్భంగా శివారు గ్రామాలకు నీటిని సరఫరా చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలో శనివారం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ ఎవరైనా ఆక్వా చెరువులకు నీటిని తరలిస్తే కేసులు నమోదు చేయిస్తామన్నారు. మోటార్లను సీజ్ చేస్తామన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

పమిడిముక్కల: రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ గణేష్‌రెడ్డి అన్నారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం గ్రామ వ్యవసాయ సహాయకులకు మట్టి నమూనాల సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొలంలో మట్టి నమూనా తీయించి అవగాహన కల్పించారు.

పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌ను అమలుపరుద్దాం

గుడివాడ టౌన్: ఆడపిల్లల నియంత్రణను పరిరక్షించడానికి కమిటీలోని ప్రతిఒక్కరూ పీసీపీఎన్‌డీటీ (ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రీ నటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్) యాక్ట్ అమలు చేసేందుకు కృషి చేయాలని ఆ యాక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.అరుణ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్ట్రా స్కాన్ విధానం అమల్లోకి వచ్చాక ఆడపిల్లల సంఖ్య తగ్గినట్లు గుర్తించిన ప్రభుత్వం 1994లో ఈ యాక్ట్ తీసుకొచ్చిందన్నారు. ఈ యాక్ట్ అమలు చేయడం వలన 2021లో జరిగిన సర్వేలో 1,000 మంది బాలురు ఉండగా బాలికలు 1,020 కి పెరిగారన్నారు. ఇది ఈ యాక్ట్ అమలు ప్రత్యేకత అని పేర్కొన్నారు.

ఘనంగా రన్ ఫర్ జీసస్

గుడివాడ టౌన్: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలో రన్ ఫర్ జీసస్ నిర్వహించారు. క్రీస్తు పునరుత్థానాన్ని తెలియజేసే సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని ఆర్‌సీఎం చర్చి వద్ద నుంచి ప్రారంభమైన ఈ పరుగు నెహ్రూచౌక్, మార్కెట్ సెంటర్, బస్టాండ్ మీదుగా సత్యనారాయణపురంలోని ఫుల్ గాస్పెల్ చర్చ్ వరకు కొనసాగింది.

రైల్వే గేట్ ఏర్పాటు చేయండి

గేట్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు



మండవల్లి: మండవల్లిలోని దేశిగుంట చెరువు వద్ద ఉన్న రైల్వే ట్రాక్‌కు రైల్వే గేట్ ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇక్కడ రైల్వే గేట్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండవల్లి మండల కేంద్రం కావడంతో ఇక్కడ ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు సమీప గ్రామాలైన సింగనపూడి, పసలపూడి, సుబ్బారావుపేట, ఉనికిలి తదితర గ్రామాల నుంచి దేశిగుంట చెరువు వైపు నుంచి వివిధ రకాల పనులకు ప్రజలు వస్తుంటారు. వీరు కార్యాలయాలకు వెళ్లాలనే హడావుడిలో ఉంటారు. ఇక్కడ ఉన్న రైల్వే ట్రాక్‌కు గేట్ లేనందు వల్ల రైళ్ల రాకపోకల తరుణంలో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇటీవల ఈ మార్గంలో ట్రాక్ దాటుతూ ఒక వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. అలాగే దేశిగుంట పశువుల చెరువు కావడంతో పశువులకు నీళ్లు తాగించడానికి, కడగటానికి వాటి యజమానులు ఇటువైపు తోలుకువస్తుంటారు. ఆ క్రమంలో పశువులు కూడా రైలు కింద పడి మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో రైల్వేట్రాక్‌కు గేట్ ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



దేశిగుంట వద్ద ఉన్న రైల్వే ట్రాక్‌కు గేట్ లేని కారణంగా తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏ క్షణంలో ఏ రైలు వస్తుందో ఎవరికీ తెలియదు. రైల్వేశాఖ అధికారులు వెంటనే స్పందించి గేట్ ఏర్పాటు చేయాలి.

– ఆర్.సతీష్, ఆనందపురం

రైల్వే గేట్ తప్పనిసరి



ఈ ఏరియాలో రైల్వేగేట్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. గేట్ లేని కారణంగా ఈ మార్గంలో ట్రాక్ మీద వెళ్లే వారికి ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియదు. రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

– వి.మాసియ్య, మండవల్లి

పోరాటయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న



రొయ్యూరులో మాట్లాడుతున్న గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి



కాజ గ్రామంలో గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

తోట్లవల్లూరు: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న సాగించిన పోరాటాలను ఎన్నటికీ మరువలేమని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి కార్యక్రమాలు శనివారం జరిగాయి. రొయ్యూరులో లచ్చన్న విగ్రహానికి గురుమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్, సర్పంచ్ శివశంకర్, నాయకులు రామినేని కుటుంబయ్య, లుక్కా రేణుకారావు, లుక్కా వెంకట శ్రీనివాసరావు, చింతపల్లి వెంకటేశ్వరరావు, వీరంకి పరశురాం, సూరి పవన్ కుమార్, వెంకటరమణ, నరేష్ పాల్గొన్నారు.

మొవ్వలో..

కాజ(మొవ్వ): మొవ్వ మండలం కాజ గ్రామంలో శనివారం స్వాతంత్ర సమరయోధుడు డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి నిర్వహించారు. ఈ పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, టీడీపీ నాయకులు జగన్నాథరావు, రామలింగేశ్వరరావు, తులసీదాస్ తదితరులు గౌతు లచ్చన్నకు నివాళులర్పించారు.

రోలర్ స్కేటింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ



గుడివాడ టౌన్: అంతర్‌జిల్లా ఓపెన్ నేషనల్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్–2025 పోటీల్లో తమ క్రీడాకారులు ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించారని ఎన్టీఆర్ స్టేడియం ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని మహాలీలో జరిగిన ఈ పోటీల్లో అండర్–7, అండర్–11 విభాగాల్లో తమ క్రీడాకారులు వి. ఆషిక, కె. కారుణ్యశ్రీ, జి. దివిష, కె. వైష్ణవిలు కాంస్య పతకం సాధించారని తెలిపారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి కె. రంగప్రసాదు, కోచ్ వి. రాజా తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పవన్‌కుమార్

ముదినేపల్లి రూరల్: తహసీల్దార్ జేఎస్ సుభాని బదిలీపై వెళ్లడంతో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న పవన్‌కుమార్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. దీంతో శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్‌ను ఎండీయూ డీలర్లు సత్కరించారు.

ఆరోగ్యకరమైన ఉత్పత్తులకు ప్రకృతి వ్యవసాయం



ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సాగు చేస్తున్న రైతులకు సన్మానం

మండవల్లి: ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తుల కోసం రైతులందరూ ప్రకృతి సాగు అవలంబించాలని ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ పేర్కొన్నారు. కొర్లపాడులో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మండల ఇన్‌చార్జి నాగవిజయ ఆధ్వర్యంలో శనివారం ప్రకృతి వ్యవసాయ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పచ్చిరొట్ట పైర్ల పెంపకం, నవధాన్యాల సాగు, పెరటి తోటల పెంపకం గురించి, వాటి ఉపయోగాలు వివరించారు. సర్పంచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం మరింత ముందుకు తీసుకువెళ్లడానికి సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం పాటించే రైతులు వాడరేవుల కృష్ణమూర్తి, చవాకుల శ్రీనివాస్, గుడిసే కృష్ణ, ఎడారి నాగేశ్వరరావులను సన్మానించారు.

మినుముకు మద్దతు ధర పొందండి



ముదినేపల్లి రూరల్: మండలంలోని రైతులు మినుముకు మద్దతు ధర పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. మండలంలోని పెయ్యేరు రైతు సేవాకేంద్రంలో అపరాల కొనుగోలు కేంద్రాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం మినుము ధర క్వింటాలకు రూ.7,400 నిర్ణయించినట్లుగా చెప్పారు. ఈ ధరకు మినుములు కొనుగోలు చేసేందుకు దేవపూడి సొసైటీలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండవల్లి ఏడీఏ వెంకటమణి, ఏఓ వేణుమాధవ్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

గుడివాడ టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులకు, సిబ్బందికి అగ్ని ప్రమాదాలపట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు రోగులను ఏ విధంగా సురక్షితంగా బయటకు చేర్చాలి అనే అంశంపై ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ జి. ఆంజనేయులు పాల్గొన్నారు.

ఫైర్ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు

స్థానిక స్టార్ ఫార్మసీ డయాగ్నస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బందికి రక్తపరీక్షలు నిర్వహించారు.

పామర్రులో..

పామర్రు: అగ్ని ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపక అధికారి ఎస్.రాంబాబు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రామంలోని పెట్రోల్ బంకుల వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు పెట్రోల్ బంక్ సిబ్బందికి అవగాహన కల్పించారు

మండవల్లిలో..

మండవల్లి: అగ్ని ప్రమాదాలను ముందు జాగ్రత్త చర్యలతో నివారించేందుకు అవకాశం ఉంటుందని అగ్నిమాపక ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. పెరికెగూడెంలో వెన్నార్ సిరామిక్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలోని భారీ భవంతుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలో శనివారం సిబ్బందికి అవగాహన కల్పించారు. జీఎం అమర్‌నాథ్, హెచ్ఆర్ ఏజీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదుపై శిక్షణ

కైకలూరు: వైద్యశాఖ ఆన్‌లైన్ నమోదులో వచ్చిన మార్పులు, చేర్పులను ప్రతిఒక్కరూ గమనించాలని డివిజనల్ నోడల్, అధికారి కోరుకొల్లు డాక్టర్ దీరజ్ చెప్పారు. హెల్త్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం నమోదు, మాతా శిశు సంరక్షణ కార్యక్రమంపై కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఫార్మసిస్టు, స్టాఫ్‌నర్సులు, హెల్త్ అసిస్టెంట్లు, 104 సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.

గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించి స్వచ్ఛ ప్రతిజ్ఞలు చేయించారు. వడాలిలో ఇన్‌చార్జి ఎంపీడీఓ బి అశోక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఊటుకూరులో సర్పంచ్ సుధాబత్తుల వరలక్ష్మి, వణుదుర్రు నీటిసంఘం అధ్యక్షుడు పోసిన పాండురంగారావు, వీరంకి వెంకయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో ఆవరణ శుభ్రపరచడంతో పాటు చెత్తను తొలగించి విద్యార్థులకు స్వచ్ఛాంధ్ర ప్రాధాన్యతను వివరించారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



కైకలూరు: ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. ఆటపాక రామాలయం వద్ద ఇటీవల శ్రీరామనవమి వేడుకలు ముగించుకున్న సందర్భంగా శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎన్నార్ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు సింగంశెట్టి రాము, నాయకులు రామారావు, రాము, రామాంజనేయులు,నాగు పాల్గొన్నారు.

ఉల్లాసంగా పాఠశాల వార్షికోత్సవం



ముదినేపల్లి రూరల్: పెయ్యేరు శివారు అప్పారావుపేట ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార పక్షోత్సవాలు



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సత్యశ్రీ

పామర్రు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు పామర్రు సెక్టార్ సూపర్‌వైజర్ సత్యశ్రీ పేర్కొన్నారు. స్థానిక అరండాల్ పేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో పక్షోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రారంభం నుంచి 1,000 రోజుల కార్యక్రమం గురించి వివరించామన్నారు. కార్యక్రమంలో అరండాల్‌పేట–1,2 అంగన్‌వాడీ టీచర్లు పద్మజ రాణి, ప్రేమకిరణ్ పాల్గొన్నారు.

కొమరవోలులో..

గ్రామంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా పౌష్టికాహార వినియోగంపై శనివారం అవగాహన కల్పించినట్లు సూపర్‌వైజర్ విజయకుమారి పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిరిశం రత్నకుమారి, కార్యదర్శి స్నేహలత, అంగన్‌వాడీ టీచర్స్ ఎం.రూతు, జీ ప్రవీణారాణి, ప్రసన్న, పావని పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రలో ప్రజలు భాగస్వాములు కావాలి



తోట్లవల్లూరులో నిర్వహించిన ప్రతిజ్ఞలో పాల్గొన్న గురుమూర్తి, రాధిక

తోట్లవల్లూరు: స్వచ్ఛ ఆంధ్రలో ప్రజలు భాగస్వాములు కావాలని గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఈ–వేస్ట్ కలెక్షన్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయటం వలన పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ఈ వేస్ట్ కలెక్షన్‌లో, గ్రామాల పరిశుభ్రతలో భాగస్వాములు అవుతామని ఆయన ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ పెనుమత్స రాధిక, ఉయ్యూరు డివిజినల్ అభివృద్ధి అధికారి రాజేష్, ఎంపీడీఓ రవికాంత్, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, ఏపీఎం సాంబశివరావు పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: మండలంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని అన్ని పంచాయతీల్లో నిర్వహించారు. ఎంపీడీఓ జే విమాదేవి గ్రామ పంచాయతీలో స్వయంగా, పాల్గొని కార్యక్రమాలను కొనసాగించారు. ఈ సందర్భంగా ఈ–వ్యర్థాల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీల్లో ఆయా కార్యదర్శుల పర్యవేక్షణలో వ్యర్థాల సేకరణ నిర్వహించారు.

ఈ–వ్యర్థాల సేకరణ, రీసైక్లింగ్‌పై అవగాహన

పమిడిముక్కల: హనుమంతపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఈ–వ్యర్థాల సేకరణ, రీసైక్లింగ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, పాడైన మొబైల్ ఫోన్‌లు, టీవీలు ఈకేంద్రాల్లో ఇవ్వడం ద్వారా కొంత నగదు పొందవచ్చని తెలిపారు. సేకరించిన వ్యర్థాలను పునర్వినియోగం కోసం పలు కంపెనీలు ముందుకు వస్తున్నాయని, అవి ప్రభుత్వానికి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సద్వినియోగం చేయాలి

పామర్రు: ఎలక్ట్రానిక్ వేస్ట్‌ను సేకరించి, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ వేస్ట్ పై గ్రామస్తులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని పురవీధుల వెంబడి నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి ఫణి ధూర్జటి, గ్రామ కార్యదర్శి అబ్దుల్ సలీం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఎస్ఐ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



గుడివాడలో దివ్యాంగులకు అందజేసిన ఉపకరణాలు



పామర్రులో దివ్యాంగులకు వీల్‌చైర్స్‌ను అందజేసిన ఎమ్మెల్యే కుమార్‌రాజా

పామర్రు: దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలను అందజేసి ప్రభుత్వం ఆదుకుంటోందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో పాఠశాల విద్యాశాఖ–సమగ్ర శిక్షా కృష్ణా జిల్లా వారి సంయుక్త ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంపిక చేసిన దివ్యాంగులైన 26 మంది చిన్నారులకు 36 రకాల ఉపకరణాలను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఫణి ధూర్జటి, పామర్రు, మొవ్వ ఎంఈఓ–2లు, ఐఈఆర్టీలు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ సమగ్రశిక్ష విభాగం ఆధ్వర్యంలో శనివారం దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ చేశారు. స్థానిక ఏజీకే హైస్కూల్లో గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాలకు చెందిన వివిధ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాలు అందజేసినట్లు ఎంఈఓ బాలాజీ తెలిపారు. గుడివాడకు 5, గుడ్లవల్లేరుకు 8, నందివాడకు 2 మొత్తం 15 మంది దివ్యాంగులకు వీల్ చైర్స్, ట్రై సైకిళ్లు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ అందజేసినట్లు పేర్కొన్నారు. సికింద్రాబాద్‌కు చెందిన ఎలిమ్‌కో సంస్థ సహకారంతో ఈ ఉపకరణాలు అందజేశామన్నారు. సర్వశిక్ష ఏఎస్ఓ నగేష్, ఎంఈఓలు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ఆర్ఐ రాము

పామర్రు: స్థానిక వాసవీ శరణాలయంలోని వృద్ధులకు శనివారం అన్నదాన కార్యక్రమాన్ని దాతలు నిర్వహించారు. పెసరమిల్లి గ్రామ వాస్తవ్యులు అల్లూరి నాగేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకుని భార్య అల్లూరి సుశీల, కుమారుడు పామర్రు ఆర్ఐ అల్లూరి రాము, సంతోషికుమారి, కుటుంబ సభ్యులు బందరురోడ్డులోని వాసవీ శరణాలయంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. శరణాలయ నిర్వాహకులు ఘంటసాల భరతుడు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాటిక ప్రదర్శనలు



విడాకులు కావాలి నాటికలో ఓ సన్నివేశం

గుడివాడ టౌన్: కృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ గుడివాడ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి నాటిక పోటీల్లో రెండో రోజు ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దాంపత్య జీవితంలో తలెత్తే చిన్న, చిన్న సమస్యలు, పంతాలు, పట్టుదలకు పోకుండా సంయమనంతో వ్యవహరించాలనే సందేశాన్ని ఇస్తూ 'విడాకులు కావాలి' ప్రదర్శించారు. లాభాపేక్ష మాని గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించాలనే కార్పొరేట్ వైద్యుని నిర్ణయం తెలియచేసే చిగురుమేఘం తదితర నాటికలు ప్రదర్శించారు.

దస్తావేజులు పోయినవి

ది. 10-4-2025న కురుమద్దాలిలోని మా ఇంటి నుండి వేరు ఇల్లు మారుచుండగా మార్గమధ్యలో దస్తావేజులు పోయినవి. దస్తావేజు నెం.1470/1995 L.P. నెం.62 రీ సర్వే నెం. 15-1 రులో య. 0.49 సెంట్లు మాగాణి భూమి ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

డొక్కు గోవిందు
S/o డొక్కు కుటుంబరావు (లేటు)
డోర్ నెం. 4-81,కురుమద్దాలి
పామర్రు మండలం. 91770 71421

సచివాలయ సహాయకుల సమస్యలు పరిష్కరించండి

పామర్రు: సచివాలయ వ్యవస్థలో విధులు నిర్వహిస్తున్న సంక్షేమ, విద్య సహాయకుల సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఉద్యోగంలో చేరి ఐదున్నరేళ్లు పూర్తయినప్పటికీ ఇంతవరకు ఏ విధమైన ప్రమోషన్ చానల్ ఏర్పాటు చేయలేదన్నారు. వివిధ సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, గ్రేడ్–2 ఖాళీలను వెల్‌ఫేర్ల ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని కోరుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు పదోన్నతులు కల్పించి ఆదుకోవాలని కోరుతూ అర్జీని ఎమ్మెల్యేకు అందజేశారు. సంక్షేమ, విద్య సహాయకులు ఆర్ సీహెచ్ రవిబాబు, పీ సృజన్, పల్లవీశ్రీ,, ఓ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.